# కోరం

ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి



**"ఏమయిందిరా లీవు?" అడిగాడు రామారావు.**

**"ఏమవుతుంది? షరా మామూలే. కుదరదదంది. రహీమ్ లీవులో వెళ్ళాడు గదా, నువ్వూ వెళ్తే ఎలా అంటోంది" అన్నాడు శ్రీనివాస్ బిక్కమొహంతో.**

శ్రీనివాస్ కొత్తగా వచ్చాడు. పాపం కొడుకు బారసాల. రెండే రోజులు శలవుపెట్టాడు, చాలా దూరమయినా శలవు దొరకదనే భయంతో. అయినా ఇవ్వలేదు పాపం.

"మరెలా? బారసాల వద్దంటుందా?" అన్నాడు వెటకారంగా రామారావు.

"వద్దనటం లేదు. కావాలంటే ఆదివారం చేసుకోండి అంటోంది. అసలే గవర్నమెంటు ఆఫీసుకు శలవులెక్కువ, పని సరిగా చెయ్యరు, ఉన్న శలవులు చాలవా అని కోపంతో వెక్కిరిస్తున్నారు వచ్చేవాళ్ళు. అందరికీ సమాధానం చెప్పలేక చస్తున్నాను అంటోంది" అన్నాడు విచారంగా శ్రీనివాస్.

"కానీ ఆదివారం ముహూర్తం ఉండాలిగా" అన్నాడు కుమార్.

"అదేకదా నా బాధ. మా మామగారు అసలే ఆర్తడాక్సు. ఏ గణాలు సరిగా లేకున్నా ఊరుకోడు. బారసాల చెయ్యడు. చెయ్యందే మా ఆవిడనీ పంపడు. దొరక్క దొరక్క ఈ ముహూర్తం దొరికింది" అన్నాడు ఏడుపు మొహంతో.

అంత విచార సన్నివేశంలోనూ నవ్వు వచ్చింది అందరికి. నిజమే పాపం. శ్రీనివాస్‌కి కొడుకు పుట్టి ఏడాది దగ్గర పడుతున్నా, సరియైన ముహూర్తం కుదరక బారసాల చెయ్యలేదు. దూరం కావటంతో శ్రీనివాస్ కూడా ఖర్చుకి వెరసి, లీవులేక ఒక్కసారే వెళ్ళాడు కొడుకు పుట్టినప్పుడు. పెళ్ళయి ఏడాదే కావటంతో భార్యని, అసలు కంటే వడ్డీ ఎక్కువ అన్నట్లు కొడుకు మీద ప్రేమ ఒకటి అధికమయి, విరహంతో ఎప్పుడెప్పుడు తెచ్చుకుందామా అన్నట్లు ఉంటే, మామగారికి తోడు ఆఫీసర్ కూడా ఇప్పుడు రాహువులా అడ్డు తగులుతోంది.

"ఏమయితే అయ్యింది. నేను శలవు పెట్టకుండానే వెళ్ళిపోతాను" అన్నాడు దృఢంగా శ్రీనివాస్.

"వద్దురా బాబు, వచ్చాక ఆవిడ నస భరించలేదు. పోనీ ఎం.డి. దగ్గరకు డైరెక్టుగా వెళ్తావా?" అన్నాడు చిన్న.

"పాపం చిన్నపిల్లాడిని అలా బలి చెయ్యకురా అలా వెళ్ళినందుకు రాజుకు ఆయన చేతే ఛార్జ్‌షీట్ ఇప్పిస్తుంది వేరే వంకతో" అన్నాడు వెంకట్.

ఇంతలోకి ఆఫీసర్ పద్మ వస్తున్న జాడ వినిపించి, ఎవరి సీట్లలోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

కానీ మనస్సులో అందరికీ చిరాగ్గా ఉంది. పెళ్ళన్నా లీవివ్వరు, చావన్నా లీవివ్వరు. ఒకవేళ ఎం.డి.తో శాంక్షన్ చేయించుకుంటే, ఏ

పెండింగ్‌కి అయినా కారణం అడిగితే, మీరు నాకు తెలియకుండా లీవివ్వడమేనని, వాళ్ళని మీరు నెత్తినెక్కించుకోవటం వల్ల నా విలువలేక నేను వాళ్ళచేత పన్లు సరిగా చేయించలేక పోతున్నానని అనటంతో ఎం.డి. ఆవిడ రికమెండేషన్ లేకుండా లీవు శాంక్షన్ చెయ్యటం మానేశాడు. లేదంటే నాకేం సంబంధం లేదని చేతులు దులిపేసు కుంటుంది. అంతా తన నెత్తిమీదే పడుతుందని ఆయన భయం.

శ్రీనివాస్‌కే కాదు, అశోక్ ఆఫీస్ ఎగ్జామ్స్‌కి వెళ్తానంటే లీవు ఇవ్వలేదు. చదవటానికి తగినంత టైము లేక పరీక్ష ఫెయిలయ్యాడు అశోక్. పెళ్ళి ఒక రోజు శలవుతో కానిచ్చేసి, మనుగుడుపులకి వగైరాలకి గుడ్‌బై చెప్పేసి, పారాణి ఆరని కాళ్ళతో డ్యూటీకొచ్చేశాడు రంగారావు. ఆవిడ కుదించిన శలవుతో వెళ్ళిరాలేక ఎల్.టి.సి. వదులుకున్నాడు రామా రావు. ఇలా ఎవరికీ లీవు ఇవ్వక వంచిన తల ఎత్తకుండా పని చేయించటంతో, టర్నోవర్ పెరిగి, ఎం.డి. కూడా ఆవిడ మాటకు ఎదురు చెప్పటం లేదు. ఎంతో విలువనిస్తున్నాడు. ఎవరి గోడు వినటం లేదు. ఆవిడ మాట వేదమయ్యింది.

మెటర్నిటీ లీవు నించి వచ్చింది రాణి. చాలా చాలాకీ అయ్యింది. అందమైనది. తెలివైనది. పద్మ వచ్చేసరికే మెటర్నిటీ లీవులో వెళ్ళింది రాణి.

"చంటిపిల్లాడండీ. ఇంట్లో చూసేవాళ్ళు లేరు. ఎలాగో ఏమిటో. ఇంకో ఆర్నెల్లు శలవుపెట్టాలి అనుకుంటున్నాను" అంది రాణి.

"ఆర్నెల్లు" ఫక్కుమని నవ్వారు మిగిలినవాళ్ళు.

"అరపూటకే గతిలేదు ఇక్కడ" అన్నారు.

"మీరు ఆవిడ వచ్చినప్పటినుంచి లేక మీకు తెలియదు. లీవులకెంత సమస్యగా ఉందో" అన్నాడు కేశవ్.


"సమస్యలంటే ఎలాగండి. చంటిపిల్లాడిని వదలటం నాకు సమస్య కాదా. ఇవ్వకపోతే ఆలోచిస్తాను" అంటూ లీవు లెటరు తీసికెళ్ళింది. లోపలి నుంచి ఉరుములు కోసం స్టాఫ్ ఎదురు చూస్తున్నారు జాలిగా. రాణి నవ్వుతూ వచ్చింది.

"గ్రాంట్ అయ్యిందా?" అడిగారు.

"భలే భయపెట్టారులెండి" అంది.

"గ్రాంట్ అయ్యిందా? " అంటూ నోరు వెళ్ళబెట్టారు.

## స్వామీజీ



**మ**నశ్శాంతి కరువైంది
తరుణోపాయం కోసం
స్వామీజీని కలిశాను
మంత్రోపదేశం చేస్తానన్నారు
పాదపూజకు పదివేలు
మంత్రోపదేశానికి
పదిహేనువేలు తెమ్మన్నారు
మనసు వికలమైంది.

**– గణపతిరాజు చంద్రశేఖరరాజు**

"ఆ పాపం ఆడదికదా! ఆడవాళ్ళ కష్టాలు ఆమెకి అర్థంకావా. ఒక్కమాట అనకుండా సంతకం పెట్టింది" అంది రాణి.

మగవాళ్ళందరికీ మండిపోయింది. ఆడవాళ్ళకేనా అవసరాలు, మగవాళ్ళకి లేవా? ఉండవా.. ఇంత పక్షపాతమా అనుకున్నారు. కానీ ఏం చేస్తారు. ఎవరికైనా చెప్పినా అదే అంటారు. ప్రెగ్నెన్సీ అని కొంతకాలం, డెలివరీ, తరువాత పిల్లవాడి పెంపకం ఇలా పద్మ రాకముందు నుంచి రాణి లీవులోనే ఉంది. ఆవిడ పని అందరి నెత్తినా పడుతూనే ఉంది. ఆర్నెల్లు గడిచింది. రాణి రేపు వస్తుంది. పనిభారం కొంచమయినా తగ్గుతుందని ఆశపడ్డారు అందరూ.

కానీ రాణి రాలేదు. ఇంకొక రెండు నెల్లు పెంచింది. కొద్దిగా ధైర్యం చేసి ఎవరో పద్మ దగ్గర అంటే గయ్యిమందిట. ఎలా వస్తుంది చిన్న పిల్లవాడిని వదిలేసి. మీకే సమస్యలుంటే ఆమెకెన్నో సమస్యలుంటాయి అందిట. పైగా ఎం.డి.కి కూడా రికమెండ్ చేసి ఆమె పనిని అందరికీ పంచి వేసింది. ఈమెలో ఇంత కరుణ ఉందా అని అందరూ ఆశ్చర్యపోయారు.

అలా రెండేళ్ళు నిండాయి. ఇంకొక క్లర్కే ఉందనే విషయం అందరూ మరచిపోయి, ఆమె పనిని అందరూ చేసుకోవటం అలవాటు చేసుకున్నారు.

మంచి పనిలో ఉండగా ఫోన్ మోగింది. చిరాగ్గా తీసింది పద్మ. రాణి గొంతు వినిపిస్తోంది. "మేడమ్! మా వారు ఫారిన్ వెళ్తున్నారు మేడం ఒక ఏడాదిపాటు. చిన్నపిల్ల వాడితో ఇబ్బంది, నేను ఆఫీసుకి వస్తే చూసేవాళ్ళు లేరు. వాడిని స్కూల్లో వేసేస్తే నాకు బాధుండదు. అందుకని ఒక ఆర్నెల్లు శలవు కావాలి, ఎలాగో దిగులుగా ఉంది మేడమ్" అంది.

పద్మ కళ్ళు మెరిశాయి. "నేను చెబుతాలేమ్మా ఎం.డి.కి. మెడికల్ లీవు పంపు. ఏం ఫరవాలేదు" అంది.

"థ్యాంక్యూ మేడమ్. నిజంగా మీరు లేకపోతే నాకెంత సమస్య అయ్యేదో. ఒకేసారి ఏడాదికి పంపేస్తాను" అంటూ ఒకటికి నాలుగుసార్లు కృతజ్ఞతలు చెప్పి ఫోన్ పెట్టేసింది రాణి.

ఆనందంగా తనూ ఫోన్ పెట్టేసింది పద్మ. రాణి వచ్చిన రోజు విషయం మరోసారి కళ్ళ ముందు కనిపించింది. "సహజంగా అందం, చలాకీతనం, తెలివి ఉన్న అమ్మాయి రాణి. దానికి తోడు వయసులో ఉంది. దాంతో అందరి కళ్ళూ ఆమె మీదే. ఎం.డి.తో సహా. అంతక్రితం వరకు మహారాణిలా వెలిగినా తను కొద్దిగా డిమ్ అయిన సంగతి, తనని గుర్తించటం తగ్గిన సంగతి తనకి స్పష్టంగా తెలిసిపోయింది ఒక రోజులోనే. ఆమె ఉంటే తనకి గుర్తింపు ఉండదని అర్థమైపోయింది. అంతవరకూ నెంబర్ వన్‌గా వెలిగిన పద్మకి ఆ విషయం చాలా బాధ కలిగించింది. ఉక్రోషం కూడా కలిగించింది. అదృష్టవశాత్తు రాణి శలవుమీద వెళ్తానంది. వెంటనే శాంక్షన్ చేసేసింది. ఆఫీసు మొత్తం మీద ఒక్కతే లేడీ కావడం వల్ల, (లీవుల విషయంలో తిట్టుకున్నా) ఫంక్షన్ అయినా, ఏం జరిగినా తనకి ప్రాముఖ్యత ఉండేది. రాణి ఉంటే ఆ అవకాశాలు తగ్గుతాయి.

ఇంకొక ఏడాదిలో తనకి బదిలీ వస్తుంది. అంతవరకూ ఆమె లీవులో ఉండటమే తనకి ఆనందం. వచ్చేస్తుందేమో అనుకుంది కానీ ఇంతలో ఆమె భర్త ఫారిన్ వెళ్లడం తనకి లాభించింది. తను వెళ్ళే వరకు లీవిచ్చి, వెళ్ళేటప్పుడు ఏదోవిధంగా చార్జ్ షీట్ ఇప్పించి వెళుతుంది. లేకపోతే పిల్లాడు పుడితే ఇన్ని రోజులు శలవా? తానొక్కతే కందా పిల్లాడిని ప్రపంచంలో" అనుకుంది కోపంగా మిస్ పద్మ. ఆమె వయస్సు నలభై అయిదు. ✻